క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించండి



భోజనాన్ని పరిశీలిస్తున్న డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి బాలాజి

ఎన్పీకుంట: బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కదిరి డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి బాలాజి హాస్టల్ సిబ్బందికి సూచించారు. గురువారం బీసీ హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లో నీటి సమస్య ఉందని సిబ్బంది తెలిపారు. బోరుబావిలో నీరు ఉన్నప్పటికీ 8 నెలల క్రితం మోటారు చెడిపోయిందన్నారు. అప్పటి నుంచి పంచాయితీ బోరు ద్వారా నీటిని ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. నాలుగు రోజుల క్రితం పంచాయతీ బోరు మరమ్మతులకు గురవడంతో నీటి సమస్య నెలకొందన్నారు.తాగునీటి సమస్యతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి బాలాజి మాట్లాడుతూ.. మోటారుకు మరమ్మతులు చేయించి నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోండి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

ముదిగుబ్బ: ముదిగుబ్బ ఎంపీడీఓ విజయలక్ష్మిపై కొందరు కావాలనే దురుద్దేశంతో ఉన్నతాధికారులకు ఊరు, పేరు లేని అర్జీలు ఇచ్చి వేధింపులకు పాల్పడుతున్నారని ప్రజాప్రతినిధులు అన్నారు. ఎంపీడీఓకు రక్షణ కల్పించాలని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు గురువారం ముదిగుబ్బ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాడిమర్రిలో ఎంపీడీఓగా విధులను నిర్వహిస్తున్న విజయలక్ష్మి.. ముదిగుబ్బ మండలానికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన మహిళా అధికారిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఊరు పేరు లేని ఉత్తరాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



సజ్జల రామకృష్ణారెడ్డిని కలసిన ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఓబిరెడ్డి

ధర్మవరం రూరల్: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఓబిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మవరం క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం, అలాగే రూరల్ పరిధిలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న హాకీ, బాస్కెట్‌బాల్ కోర్టుల నిర్మాణాలపై చర్చించారు. చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ మైదానానికి రూ.40 లక్షలు, బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణాలకు రూ.40 లక్షలు, అలాగే ధర్మవరం క్రీడా మైదానంలో రూ.1.70 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. నిర్మాణాలకు వెంటనే నిధులు మంజూరు చేయించాలని విన్నవించారు. త్వరలోనే వీటి నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అమడగూరు: మండలంలోని కర్ణాటక బార్డర్ ప్రాంతం ఆకులవారిపల్లి సమీపంలో బుధవారం రాత్రి భారీగా కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ వెంకటనారాయణ గురువారం వివరాలను వెల్లడించారు. అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో ఆకులవారిపల్లి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక జూలుపాళ్యం గ్రామానికి చెందిన నరసింహ మూర్తి కారులో 3,360 టెట్రా పాకెట్లు, 5 బీరు బాక్సులు, 5 ఓల్డ్ మంక్ బాక్సులను కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. కారును సీజ్ చేసి, కేసు నమోదు చేసి ముద్దాయి నరసింహమూర్తిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అయితే మరో వ్యక్తి మురళీకృష్ణ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, చంద్రహాస్, రత్నాకర్, భార్గవ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



సచివాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



ధర్మవరం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

కదిరి అర్బన్: ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదుగుతోందని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సచివాలయం-2 వద్ద నియోజకవర్గ స్థాయిలో నా భూమి-నా దేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం చిన్నాభిన్నమైన దేశ ఆర్థిక వ్యవస్థను ఎందరో మహనీయులు గాడినపెట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకూ ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకువచ్చారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తూ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. దేశంలోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో మొదట ఐదు స్థానాల్లో మన రాష్ట్రం నిలుస్తోందన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సచివాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. మొక్కలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్ రెడ్డి, డీఎల్‌డీఓ సూర్యనారాయణ, ఎంపీడీఓ అంజనప్ప, ఎంపీటీసీ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, మాజీ సర్పంచులు ఇంద్రప్రసాద్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పలు మండలాల ఎంపీడీఓలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పరిశీలించారు. నాణ్యతతో పనులు పూర్తి చేసి పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీర్‌ను ఆదేశించారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నా భూమి-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ గిరక రమాదేవి, సర్పంచ్ పిట్టా నరసమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సౌజన్యకుమారి మాట్లాడుతూ.. నాలుగు మండలాల నుంచి తెచ్చిన మట్టి కలశాలను సేకరించి ఒక బిందెలో వేసి జిల్లా కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. విద్యార్థులతో కలిసి మొక్కలను నాటిన అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీ మమతాదేవి, సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గొట్లూరు సంగాలప్ప, పిట్టా నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా శ్యామరావు



ధర్మవరం అర్బన్: ధర్మవరం ట్రాఫిక్ సీఐగా శ్యామరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు సహకరించాలని కోరారు.

'జగన్ ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరు'

కదిరి: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని టైమ్స్‌నౌ సర్వే పేర్కొంది. జగన్ ప్రభంజనాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని సివిల్ సప్లయిస్ రాష్ట్ర డైరెక్టర్ జగన్‌మోహన్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసారి ప్రతిపక్ష నేత చంద్రబాబు సైతం కుప్పం నియోజకవర్గంలో ఓడిపోవడం ఖాయమన్నారు. టీడీపీ పెత్తందార్ల పార్టీ అని, వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ అని ప్రజలూ గ్రహించారన్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అది ఆయనకు మరింత నష్టం చేకూరుస్తుందన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయాలి

కదిరి: రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 8 వరకూ సీపీఐ చేపట్టిన ప్రచార జాత-బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మీసాల వేమయ్య యాదవ్ కోరారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో గురువారం ఆ పార్టీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు తక్షణం పరిహారం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ కదిరి, పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శులు ఇషాక్, అంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేంద్ర చౌదరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇన్వాయిస్ ప్రకారం జీతాలు చెల్లించాలి

ఎన్పీకుంట: తమకు నిర్దేశించిన ఇన్వాయిస్ ప్రకారం జీతాలు చెల్లించాలని విశ్వం సెక్యూరిటీ ఏజెన్సీ కింద విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని స్ప్రింగ్ అండ్ ఎనర్జీ సోలార్ ప్రాజెక్ట్ కంపెనీ గేటు వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. నెలకు రూ.18,000 జీతం ఉన్నప్పటికీ కంపెనీ వారు రూ.11,000 మాత్రమే చెల్లిస్తున్నారని మండిపడ్డారు. ప్రతి నెల కరెక్టుగా జీతాలు ఇస్తున్నప్పటికీ ఆ జీతాల్లో కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరాల నిమిత్తం సెలవులు పెడితే ఆ సెలవులకు రెట్టింపు జీతం కట్ చేస్తున్నారని తెలిపారు. పే స్లిప్పులను సైతం తమకు ఇవ్వడం లేదని వాపోయారు. ఈ విషయమై సంబంధిత సైట్ ఇన్‌చార్జ్‌ను సంప్రదించగా.. ఏజెన్సీ వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రేపు శంకుస్థాపన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్య గుట్టలో ఈనెల 19వ తేదీన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షురాలు జయశ్రీ తెలిపారు. గురువారం స్థానిక సిద్దయ్యగుట్టలోని ఆలయ నిర్మాణ ప్రాంతంలో ఆలయ కమిటీ సభ్యులు కరపత్రాలు విడుదల చేశారు. ఆలయంతో పాటు కళ్యాణ మండపం, భక్తుల తలనీలాల కోసం కళ్యాణకట్ట, గరుత్మంతుడి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి సంఘం గౌరవాధ్యక్షుడు గడ్డం పార్థసారధి, కోశాధికారి కలవల మురళీధర్, సభ్యులు పుట్లూరు నరసింహులు, ప్రకాష్, ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు అవినాష్ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు మీ ఇంటి వద్దకు వచ్చానని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 12వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో డ్రైనేజీ కాలువలను సరిగ్గా శుభ్రం చేయలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎప్పటికప్పుడు కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు ఎమ్మెల్యే సూచించారు. తమకు ఇంటి పట్టా వచ్చినా బిల్లులు పడలేదని పలువురు జగనన్న కాలనీల లబ్ధిదారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే హౌసింగ్ ఏఈతో మాట్లాడి బిల్లులు త్వరితగతిన పడేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ.. సచివాలయ పరిధిలో ఏ చిన్న సమస్య కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు వారి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తొండమాల ఉమాదేవి, వార్డు ఇన్‌చార్జ్ తొండమాల రవి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యక్తిపై కట్టెతో దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామాపురంలో గురువారం రాత్రి చంద్రశేఖర్ అనే వ్యక్తిపై చిన్నా, ప్రభాకర్ దాడి చేసి గాయపరిచారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రశేఖర్ చెల్లెలు శ్రీలక్ష్మికి డబ్బు విషయంలో గొట్లూరుకు చెందిన చిన్న, ప్రభాకర్, మరికొందరితో గొడవలున్నాయి. గురువారం సాయంత్రం శ్రీలక్ష్మి వాజిమోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో వైద్యం చేయించి ఇంటికి తీసుకెళ్లారు. చెల్లెలు శ్రీలక్ష్మిని చూసేందుకు వెళుతున్న చంద్రశేఖర్‌ను గొట్లూరుకు చెందిన చిన్నా, ప్రభాకర్ కొట్టారు. స్థానికులు గమనించి చంద్రశేఖర్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని..

పట్టణంలోని దుర్గానగర్ మద్యం దుకాణం వద్ద గురువారం పోతుకుంటకు చెందిన గోవిందు అదే గ్రామానికి చెందిన నారాయణస్వామితో మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. నారాయణస్వామి డబ్బులు ఎందుకు ఇవ్వాలి అంటూ గోవిందుతో గొడవపడ్డాడు. కట్టె తీసుకుని గోవిందు తలపై కొట్టాడు. ఈ దాడిలో గోవిందుకు గాయాలయ్యాయి. స్థానికులు గోవిందును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు కోరారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు జనార్దన్, కోశాధికారి తిరుపాలు, సూరి, నరసింహమూర్తి, రామాంజులు, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్ అలీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల చెక్కు అందజేత



ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 వేల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల పంచాయతీ జీడిమేకలపల్లి గ్రామానికి చెందిన ఎస్. అన్వర్‌బాషా మూడు నెలల క్రితం ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి ప్రభుత్వ సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మృతుడి భార్య షాజిదాకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీపీ తాతం జగన్‌మోహన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లమాడ: మండలంలోని చెరువువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వై.నీలకంఠారెడ్డి (42) అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న నల్లమాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు టీడీ క్రిష్ణసుమన్ రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయాన్ని సమకూర్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు కోనపల్లి నరసింహారెడ్డి తదితరులు గురువారం మృతుడి భార్య మాధవికి నగదు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



రూ.50 వేల సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన సాకే హనుమంతు భార్య సాకే కవిత ఇటీవల మరణించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ బాధిత కుటుంబలను ఓదార్చారు. అనంతరం రూ.50 వేల ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే స్వగృహంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల మంజూరు

అమడగూరు: అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు అమడగూరులో ప్రతి ఇంటిని సందర్శించారు. నూతనంగా నిర్మితమవుతున్న జగనన్న ఇళ్లను పరిశీలించారు. బిల్లుల మంజూరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ ఇళ్లు మంజూరు కానివారు గ్రామ వలంటీర్ లేదా సచివాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, నాయకుడు శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, మండల పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ సురేష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుకుందాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

ధర్మవరం అర్బన్: ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అప్పుడే ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దవచ్చని మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, డిగ్రీ కళాశాలల హెచ్‌ఎం, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్‌లు, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల భావితరాలకు ఎంతో నష్టం వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్‌తో వచ్చే అనారోగ్య సమస్యలు, అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు అందరి సహకారం అవసరమన్నారు. వెయ్యి కేజీలకుపైగా ప్లాస్టిక్‌ను తెచ్చిన వారికి మొదటి బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు చొప్పున నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. 23వ తేదీన ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సేకరించిన ప్లాస్టిక్‌ను పరిశీలించి తూకాలు వేస్తామన్నారు. ఎక్కువ ప్లాస్టిక్ సేకరించిన వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నగదు బహుమతులు అందిస్తారని తెలిపారు. ఆయా వార్డుల్లో ప్లాస్టిక్ సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, మున్సిపల్ సహాయ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్‌బాషా, శాంసన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా పంటకోత ప్రయోగాలు



మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణయ్య, ఏఓ ఓబిరెడ్డి, ఏఎస్ఓ శర్మ

బత్తలపల్లి: మండలంలో పంటకోత ప్రయోగాలను పారదర్శకంగా చేపట్టాలని ఏడీఏ క్రిష్ణయ్య, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహ శర్మ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి అధ్యక్షతన పంటకోత ప్రయోగాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది బత్తలపల్లి మండలంలో వేరుశనగ, కంది, ఆముదం, వరి పంటలకు పంటకోత ప్రయోగాలను నిర్వహించుటకు ఎంపికైనట్లు వివరించారు. పీఎంఎఫ్‌బీవై యాప్‌లో ప్రయోగాల దిగుబడులను అప్‌లోడ్ చేసే విధానంపై వివరించారు. ఈ సంవత్సరం కంది గ్రామం యూనిట్‌గా దిగుబడి ఆధారముగా ఇన్సూరెన్స్‌కు, వేరుశనగ వాతావరణం ఆధారంగా ఇన్సూరెన్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. వరి, మొక్కజొన్న మండలం యూనిట్‌గా, రాగి, ఆముదం జిల్లా యూనిట్‌గా ఇన్సూరెన్స్‌కు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉపేంద్ర, వీరాంజనేయులు, వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్ఏ, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఆర్టీసీ అధికారులు, కండక్టర్ రజియాబీ

ధర్మవరం అర్బన్: ధర్మవరం డిపో నుంచి అనంతపురం వెళ్లే ఆర్డినరీ బస్సులో సెల్‌ఫోన్ మర్చిపోయిన ఓ ప్రయాణికుడికి కండక్టర్ రజియాబీ సెల్‌ఫోన్ అందజేసి, నిజాయతీ చాటుకున్నారు. వివరాలు.. బత్తలపల్లికి చెందిన కుమార్ ధర్మవరంలో బస్సు ఎక్కి బత్తలపల్లిలో దిగాడు. దిగే సమయంలో తన జేబులో ఉన్న రూ.23 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ బస్సులో మర్చిపోయాడు. కండక్టర్ రజియాబి సెల్‌ఫోన్‌ను తీసుకుని ఆర్టీసీ బస్టాండ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం వారు ప్రయాణికుడు కుమార్‌ను పిలిపించి సెల్‌ఫోన్ అందజేశారు.

పేదలకు ఉచిత అంబులెన్స్ సేవలు

ధర్మవరం అర్బన్: కులమతాలకు అతీతంగా పట్టణంలో అల్ ఖిద్మత్ టీమ్ పేరుతో పేద ప్రజలకు ఉచిత అంబులెన్స్ సేవలు అందిస్తామని అల్లాబకాష్, షమీవుల్లా గురువారం తెలిపారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు ఉచితంగా అంబులెన్స్ పంపిస్తామన్నారు. అంబులెన్స్ కావాల్సిన వారు 9494575120, 9966022512 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

నల్లచెరువు: స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ డాక్టర్‌గా అవార్డు అందుకున్న మండల వైద్యాధికారి డాక్టర్ ఐనుద్దీన్‌ను స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, పీహెచ్ఎన్ భారతి, సూపర్‌వైజర్లు సుధాకర్, రెడ్డెమ్మ, లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, సుమలత, నర్సరీ భాను, గాయత్రి, శ్రావణి, శాంతా కుమారి, మాధురి, తస్లీం భాను, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణ రెడ్డి, మున్నా, శ్రీనివాసులు రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోను తనిఖీ చేసేందుకు వచ్చిన సత్యసాయి జిల్లా నిఘా విభాగం ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్‌ను గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. నిఘా విభాగం ఇన్‌స్పెక్టర్‌గా ఉత్తమ సేవలు అందించినందుకు గాను విజయ్‌కుమార్‌కు స్వాతంత్ర్య దినోత్సవం రోజున అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు హరిమోహన్, రమణ, బైరిశెట్టి, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు తారురోడ్లు

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని అన్ని మారుమూల గ్రామాలకు తారురోడ్లు వేయిస్తున్నామని ఏఈఈ మురళి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే దాదాపుగా చాలా గ్రామాలకు తారురోడ్లను వేయించామన్నారు. ఎన్నో ఏళ్లుగా సరైన దారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న చల్లావారిపల్లికి తారురోడ్డును వేసి, సమస్యను పరిష్కరించామన్నారు. కొండకమర్ల నుంచి చల్లావారిపల్లి, బాలప్పగారి, గౌరాపురం క్రాస్ వరకూ తారురోడ్డు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల తారకరామ నగర్‌కు చెందిన మూడే నడిపి రెడ్డమ్మ అనే బాలిక కనిపించడం లేదని తండ్రి మూడే హనుమంతునాయక్ గురువారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక ఈనెల 16వ తేదీ నుంచి కనబడటం లేదని తెలిపాడు. బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.